# న్యాయం కళ్లకు ఎన్నాళ్లీ గంతలు?

జయప్రకాష్ నారాయణ్

**BB- 06-Mar-2006**

నేడు ఇండియా ప్రపంచాన్నే ప్రభావితం చేయగలిగేంత గొప్ప శక్తిసంపన్న దేశంగా ఆవిర్భవించగలిగిందంటే - అందుకు కొన్ని నిర్దిష్ట కారణాలు ఉన్నాయి. అవి: మనం జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడుకోగలిగాం. మన సైనికులు, శాస్త్రజ్ఞులు తమ ప్రతిభాసామర్థ్యాలను నిరూపించుకున్నారు. ముఖ్యంగా మన ప్రజలు తమ ప్రభుత్వాలే కల్పించిన అడ్డంకులను అధిగమించి, ఘనమైన ఆర్థిక ప్రగతి సాధించేందుకు దోహదపడ్డారు. ప్రజలు సమైక్యంగా లేకపోతే, రక్షణ దళాలు పటిష్ఠంగా లేకపోతే, ఆర్థిక వ్యవస్థ శీఘ్ర ప్రగతి సాధించలేకపోతే -ఏ దేశమూ గొప్పశక్తి కాజాలదు. నిజమే. మన దేశాన్ని పేదరికం పట్టిపీడిస్తోంది. లక్షల మంది యువజనులకు ఉపాధి అవకాశాలు కరవయ్యాయి. అనారోగ్యం, నేరాలు, హింస, అభద్రతభావం భయపెడుతున్నాయి. ప్రజల అసలు సమస్యలను పరిష్కరించడంలో మన సమాజం, ప్రభుత్వం విఫలం చెందడమే ఇందుకు కారణం. మన తప్పిదాలకు మరే ఇతర దేశాన్ని, విదేశీ సంస్థను నిందించలేం.

సొంత ఇంటిని చక్కదిద్దుకోవడంలో మన ఘోరవైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం - జెస్సికా లాల్ విషాద ఉదంతం. జెస్సికా లాల్ హత్య కేసులో సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిందితులంతా నిర్దోషులుగా విడుదల అయ్యారు. భారత్ - అమెరికా శిఖరాగ్ర చర్చల హడావుడిలో ఈ అంశం పత్రికల పతాక శీర్షికలకెక్కలేదు. కానీ, ఈ కేసు నుంచి నేర్చుకోవలసిన పాఠాలను విస్మరించడం వివేకం అనిపించుకోదు.

## ప్రలోభాలతో కేసు పక్కదారి

జెస్సికా లాల్‌ను ఎవరు హత్యచేశారనే విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. కానీ, న్యాయస్థానాలకు సాక్ష్యాధారాలు కావాలి. ఈ కేసులో న్యాయం జరగకపోవడంపై భిన్నవాదనలు వినవస్తున్నాయి. పోలీసులు ఈ కేసును నీరుగార్చారు. మొదట నిర్లక్ష్యం వహించారు. తూతూమంత్రంగా దర్యాప్తుతో తంతును ముగించారు. తరవాత కేసును బలహీనపరచడానికి సాక్ష్యాధారాలను కావాలనే తొక్కిపెట్టారు. నిందితుల కుటుంబాల నుంచి వచ్చిన రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు, అవినీతి ఇందుకు కొంతవరకు కారణం. పోలీసులు తప్పుడు సాక్షులను ప్రవేశపెట్టడం ద్వారా కేసును మరింత బలహీనపరిచారు. నేరాన్ని నిరూపించలేని పరిస్థితి సృష్టించారు.

పోలీసుల వైఫల్యం నాణానికి ఒక పార్శ్వం మాత్రమే. సాక్షుల్లో అనేకమంది సాక్షులు తమ వాంగ్మూలాలను తరవాత మార్చుకొన్నారు. చాలామంది తొలుత నిందితులను గుర్తుపట్టారు. కోర్టులో మాత్రం వారు మాట మార్చారు. అంగారక గ్రహం నుంచి అజ్ఞాత వ్యోమచరాలేవో వచ్చి, జెస్సికా లాల్‌ను కాల్చిచంపి తమ ఆనవాళ్లేవీ వదలకుండా హటాత్తుగా మాయమైపోయినట్లుంది- ఇదంతా. ఒకటి మాత్రం స్పష్టమవుతోంది. అనేకమంది సాక్షులను కొనేశారు. సాక్ష్యమిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని కొంతమందిని బెదిరించారు. కొంతమంది పిరికివాళ్లు సాక్ష్యం ఇవ్వడానికే ముందుకు రాలేదు. కారణమేదైనా సరే- ప్రమాణంచేసి అబద్ధమాడటాన్ని పశ్చిమ దేశాల్లో సిగ్గుమాలిన చర్యగా పరిగణిస్తారు. మన దేశంలో మాత్రం ఈ కేసులోను, న్యాయస్థానాల్లో ఉన్న ఇతర కేసుల్లోనూ ప్రమాణం చేసి మరీ పచ్చి అబద్ధాలాడేస్తున్నారు.

తన నేర న్యాయ వ్యవస్థలో ఇన్ని లొసుగులు, లోపాలు కలిగిన దేశం గొప్పతనాన్ని ఆశించజాలదు. ఒక హంతకుడు పెద్దవాళ్లతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవాడైతే; ఖరీదైన, తెలివైన, నీతినియమాల్లేని న్యాయవాదిని పెట్టుకొంటే- ఏ న్యాయస్థానమూ ఆయన్ని దోషిగా నిర్ధారించలేదు. అందువల్లే ప్రజలు మన 'న్యాయ వ్యవస్థపై' నమ్మకం కోల్పోతున్నారు. న్యాయస్థానంలో న్యాయం లభిస్తుందన్న నమ్మకం లేనప్పుడు- మనముందు రెండే మార్గాలు ఉంటాయి. అన్యాయాన్ని దిగమింగి మౌనంగా బాధపడటం- ఒక మార్గం. నేరగాళ్ల ముఠాలను ఆశ్రయించి హింసాత్మకమైన, దుర్మార్గమైన పద్ధతుల ద్వారా పరిహారం లేదా ప్రతిఫలం పొందడం- రెండో మార్గం. అందుకే- మన దేశంలో కిరాయి హంతకులు దినదినాభివృద్ధి చెందుతున్నారు. రాజకీయాల్లోనూ చేరి, ఆరితేరిపోతున్నారు. ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. మన హక్కులు అమలయ్యేలా చూడటం, శాంతియుత, నాగరిక, చట్టబద్ధ పద్ధతుల ద్వారా నేరగాళ్లను శిక్షించడం- న్యాయ వ్యవస్థ చేయాల్సిన పని. న్యాయవ్యవస్థ విఫలం కావడంవల్ల హింసాకాండ, నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి.

మనం మన ప్రజలను పరిరక్షించుకోవాలన్నా, నాగరిక జాతిగా మనుగడ సాగించాలన్నా జెస్సికా లాల్ కేసులో వెల్లడైన సమస్యలన్నింటినీ పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఈ కేసుకు సంబంధించిన అనేక అంశాలు నిజ జీవితానికి - సినిమాకు మధ్యగల తేడాను చెరిపివేశాయి. తుపాకులు చేతపట్టి చెలరేగిపోతూ ప్రజల్ని భయభ్రాంతుల్నిచేసే రాజకీయ నాయకుల పుత్రరత్నాలు; హఠాత్తుగా విరుచుకుపడి హత్యలకు తెగబడే సాయుధ ముఠాలు; అవినీతి - అక్రమాలకు పాల్పడే పోలీసులు; పిరికితనంతో వణికిపోయే ప్రజలు, సాక్షులు; నేరవిచారణలో రాజకీయ జోక్యం; ప్రలోభాలు - లంచాలు; తప్పుడు సాక్ష్యాలు; తీవ్ర దురన్యాయం - ఇవన్నీ మన సినిమాల్లోని సన్నివేశాలే. జెస్సికా లాల్ కేసులో ఆ సిగ్గుమాలిన దృశ్యాలే కనిపించాయి.

నేర న్యాయ వ్యవస్థ విఫలమైనప్పుడు - గొప్ప శక్తిగా మనం ఉండజాలం. డబ్బుకు అమ్ముడుపోయే పిరికి సాక్షులు, ఒత్తిళ్లకు లొంగి తప్పుడు సాక్ష్యాలు ఇచ్చేవారు ఉన్నప్పుడు జాతి శోభిల్లలేదు. నేరగాళ్లు వర్ధిల్లుతున్నప్పుడు ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టజాలదు. హంతకులు చట్టసభల సభ్యులుగా, మంత్రులుగా అవతారాలెత్తుతున్నప్పుడు స్వేచ్ఛ బతకజాలదు. అవినీతిపరులు, కుటిలురైన రాజకీయనాయకులకు తాబేదార్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నప్పుడు చట్టబద్ధపాలన కనుమరుగైపోతుంది. బుష్ భారతదేశంలో పర్యటించినప్పుడు ప్రపంచశక్తి, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధపాలన, తదితర పదాలు పదేపదే ప్రస్తావనకు వచ్చాయి. ఇవన్నీ ఉత్తుత్తి మాటలో, నయవంచకత్వపు నవ్యచాలనలో కావని, మన దేశానికి సంబంధించి ఈ మాటల్లో ఎంతో అర్థం - పరమార్థం ఉందని నిరూపించుకోవలసిన అవసరం ఉంది.

### సత్వరం సంస్కరణలు

జెస్సికా లాల్ కేసులో న్యాయవ్యవస్థ ఘోరవైఫల్యం వల్ల ఏర్పడిన భావోద్వేగాలు - మన నేర న్యాయ వ్యవస్థ ప్రక్షాళనకు తోడ్పడగలవు. జరిగిన ఘోరాన్ని జాతి నవనిర్మాణానికి దోహదపడే సదవకాశంగా నాయకత్వం మార్చగలదు. దారితప్పిన మన నేర న్యాయవ్యవస్థను తిరిగి గాడిలో పెట్టే మార్గాలు కనుగొనడం, వాటిని అమలుపరచడం పెద్దకష్టమేమీకాదు. కానీ, అందుకు కొన్ని చర్యలు తప్పనిసరి. స్వతంత్ర, వృత్తి నిబద్ధతగల నేర విచారణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. విచారణలో నిర్లక్ష్యం వహించకుండా, న్యాయానికి అవరోధం కలిగించకుండా గట్టి నియంత్రణలు ఉండాలి. సాక్ష్యాధారాల సేకరణకు మెరుగైన ఫోరెన్సిక్ సదుపాయాలు, ఆధునిక ఉపకరణాలు కావాలి. ప్రమాణంచేసి అబద్ధాలు చెప్పకుండా నిరోధించడానికి గట్టి చట్టాలను రూపొందించి అమలు జరపాలి. కోర్టుల్లో నిజాలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలియజెప్పడానికి ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలి. సమర్థులైన, నిజాయతీపరులైన న్యాయమూర్తులే ఎంపిక అయ్యేలా చూడటానికి నియా

మక ప్రక్రియను మెరుగుపరచాలి. న్యాయస్థానాల్లో జాప్యాన్ని నివారించడానికి విధానపరమైన సంస్కరణలు తీసుకురావాలి. అవినీతిపరులైన పోలీసులను, న్యాయమూర్తులను ఏరివేయడానికి పద్ధతి ప్రకారం చర్యలు తీసుకోవాలి. నిజాల్ని వెలికితీయడంపై ఆసక్తిగల మెరుగైన న్యాయ వ్యవస్థ కావాలి. అధికార పీఠాన్ని అధిష్ఠించకుండా నేరగాళ్లను, ప్రతి వ్యవస్థనూ అవినీతిమయం చేయకుండా డబ్బుసంచులను నిరోధించడానికి రాజకీయ సంస్కరణలు తీసుకురావాలి. ఇదంతా ఒక్క రోజులో జరిగే పనికాదు. ఆ మాటకొస్తే ఒక ప్రభుత్వ హయాంలో కూడా జరగకపోవచ్చు. కానీ సత్వరం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టవలసిన అవసరం ఉంది. జాతి తలెత్తుకోగలిగే వ్యవస్థలను నిర్మించడంతోపాటు చట్టబద్ధ పరిపాలనను సాగించడంపైనే నాయకత్వ గొప్పతనం ఆధారపడి ఉంటుంది. ప్రజలకు ప్రాథమిక న్యాయం కూడా దక్కనప్పుడు ఇండియా గొప్పదేశంగా మన్ననలు పొందజాలదు. అందరికీ న్యాయం లభిస్తుందన్న హామీ ఉండాలి. చట్టం ముందు అందరూ సమానం కావాలి. జాతి కులమతాలతో సంబంధం లేకుండా మన పిల్లలందరికీ అవకాశాలు లభించాలి. అప్పుడు మన గొప్పతనాన్ని ఎవరూ కాదనలేరు. ఈ నిజమైన గొప్పతనాన్ని సాధించేందుకు వీలుగా మన రాజకీయాలను పునర్ వ్యవస్థీకరిస్తామంటూ మనమంతా ప్రతినబూనాలి.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)